సాక్షి ఖమ్మం

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



నీట్‌గా నాట్లు..
పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన పలువురు నీట్‌గా నాట్లు వేస్తుండడంతో జిల్లా రైతులకు కూలీల కొరత తీరినట్టయింది. 8లో



దోపిడీ రహిత సమాజమే లక్ష్యం
దోపిడీ లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 17°

వాతావరణం
జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ ప్రదర్శన

ఖమ్మం సహకారనగర్: కేంద్రప్రభుత్వ డిపార్ట్ మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యాన 2022–23వ విద్యాసంవత్సరానికి జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీ ఆదేశాలమేరకు ఇన్‌స్పైర్ మానక్ యాప్ ద్వారా వచ్చేనెలలో ఈ ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాస్థాయికి 108 ఎగ్జిబిట్లు ఎంపిక కాగా, విద్యార్థులకు రూ.10వేల చొప్పున ఖాతాల్లో నగదు జమ అయిందని తెలిపారు. ఆయా విద్యార్థులు తమ ఎగ్జిబిట్లను జనవరి 18లోపు అప్‌లోడ్ చేయాలని, వివరాలకు సైన్స్ అధికారి డి.జగదీశ్వర్(9440354528)ను సంప్రదించాలని సూచించారు.

మరో 11మంది వైద్యులకు స్థానచలనం



ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న 11 మంది వైద్యులను జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రులకు శుక్రవారం బదిలీ చేయగా, శనివారం కూడా మరో 11 మందికి స్థానచలనం కలిగింది. వైద్య విధాన పరిషత్‌కు చెందిన తిరుమలాయపాలెం, సత్తుపల్లి, నేలకొండపల్లి, మధిర, కల్లూరు, పెనుబల్లి ఆస్పత్రులకు వీరిని బదిలీ చేశారు. ఇందులో సివిల్ సర్జన్లు కె.కృపాఉషశ్రీ, కె.రామ్మూర్తి, బి.శ్రీనివాసరావు, కె.రాజశేఖర్‌గౌడ్, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఎం.కవిత, టి.లక్ష్మణ్‌కుమార్, డి.శ్రీనివాస్, టి.సురేష్, ఎ.లవణ్‌కుమార్, పృథ్వీకృష్ణ, జి.వరుణ్ ఉన్నారు. వీరిని శనివారం జీజీహెచ్ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ రిలీవ్ చేశారు. కాగా, ఖమ్మం ఆస్పత్రి నుంచి రెండు రోజుల వ్యవధిలో 22 మంది వైద్యులు బదిలీ కావడంతో కొరత ఏర్పడినట్లయింది. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి డాక్టర్లు వచ్చే వరకు వైద్యసేవలపై కొంతమేర ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

ఆస్పత్రిపై నమ్మకం పెంచాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

ఖమ్మం వైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రిపై నమ్మకంతో వచ్చే వారితో మర్యాదగా వ్యవహరిస్తూ మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓలు బి.శ్రీనివాసరావు, డాక్టర్ అమర్‌సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ సూచించారు. ఆస్పత్రిలో శనివారం వారు పేషంట్ కేర్, సెక్యూరిటీ, పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమై మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, తరచుగా గైర్హాజరైతే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అలాగే, ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచుతూ రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆస్పత్రి భద్రతపై సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు చేశారు.

మెడికల సాకారం..

ఈ యేడాది వైద్య పరంగా జిల్లాలో పలు రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైద్య విద్యతో పాటు ప్రభుత్వం రోగుల కోసం పలు కొత్త పథకాలు అందుబాటులోకి తెచ్చింది. మహిళా ఆరోగ్య పథకం, న్యూట్రీషన్ కిట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల విలువైన చికిత్స వంటి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. ఇక జిల్లాకు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వైద్య కళాశాల కల ఎట్టకేలకు సాకారం అయింది. జిల్లాకో మెడికల్ కాలేజీ ఉండాలనే ఉద్దేశంతో 2022 మార్చిలో గత ప్రభుత్వం ఖమ్మంలో కళాశాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో పాటు నిర్మాణానికి రూ.166 కోట్లు కేటాయించింది. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని అనుసంధానిస్తూ పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ భవనాలను కలుపుకొని మొత్తం 30 ఎకరాలు కేటాయించింది. పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ, డీఎంహెచ్‌ఓ భవనాలను ఆధునికీకరించి వైద్య విద్యకు సిద్ధం చేయగా, నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతితో నీట్ ద్వారా ర్యాంకులు పొందిన విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారు. ఈ మేరకు సెప్టెంబర్ 15న తరగతులు ప్రారంభించారు. తొలి ఏడాది 100 మంది అడ్మిషన్లు పొందారు. – ఖమ్మం వైద్యవిభాగం



మెడికల్ కళాశాల భవనం

అందుబాటులోకి వైద్య కళాశాల

- ఆరోగ్య మహిళ, న్యూట్రీషన్ కిట్ పథకాలతో మహిళలకు లబ్ధి
- పెద్దాస్పత్రిలో మోకీలు శస్త్ర చికిత్సలు
- కంటి వెలుగుతో 6.5 లక్షల మందికి ప్రయోజనం

కొత్త పథకంతో మహిళలకు మేలు..

మహిళలు ఎదుర్కొంటున్న పలు రకాల వ్యాధుల బారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేక పథకం ప్రవేశపెట్టింది. మహిళా దినోత్సవం సందర్భంగా గత మార్చి 8న 30 ఏళ్ల పైబడిన మహిళల కోసం ఆరోగ్య పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో 12 పీహెచ్‌సీలకు అనుమతి ఇవ్వగా నిత్యం మహిళలకు ప్రత్యేక చికిత్సలు అందుతున్నాయి. సమస్య తీవ్రంగా ఉన్న వారిని ఖమ్మం మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేస్తున్నారు. వారి కోసం ప్రత్యేకంగా ప్రతీ మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి, అవసరమైన పరీక్షలు నిర్వహించి, మందులు అందిస్తున్నారు. ఇక్కడ అందుబాటులో లేని వైద్యానికి హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. ఖర్చుతో కూడుకున్న వైద్యం ఉచితంగా లభిస్తుండటంతో ఎక్కువ మంది మహిళలు ఆయా సెంటర్లకు వచ్చి చికిత్స పొందుతున్నారు. పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 12 పీహెచ్‌సీల ద్వారా 17,142 మంది మహిళలు వైద్య సేవలు పొందారు. అలాగే ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రతీ మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమంలో పీహెచ్‌సీల ద్వారా 2,765 రిఫరల్ కేసులకు వైద్య సేవలు అందించారు. 6,885 మంది మహిళలు నేరుగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందారు. ముఖ్యంగా 71 మందికి కేన్సర్ ఉన్నట్లు గుర్తించగా వారిని హైదరాబాద్ ఎంఎన్‌జే ఆస్పత్రికి పంపించి చికిత్స అందించారు. ఇందులో 13 మంది మృత్యువాత పడ్డారు.

6.50 లక్షల మందికి కంటి పరీక్షలు..

కంటి సమస్యలతో బాధపడే వారికి పరీక్షలు నిర్వహించాలని అప్పటి సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ క్రమంలో 2018లో తొలి విడత కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రెండో దశ కార్యక్రమాన్ని ఈ ఏడాది మొదట్లో ప్రారంభించారు. కొత్త కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా అందులో ఓ విభాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటి శిబిరాన్ని జనవరి 18న నాటి సీఎం కేసీఆర్.. ఢిల్లీ, కేరళ, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, పినరయ్ విజయన్, భగవంత్ సింగ్ మాన్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. మూడు నెలల పాటు సాగిన కంటి వెలుగు కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 6,50,779 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 1,26,065 మందికి రీడింగ్ గ్లాస్‌లు పంపిణీ చేశారు. మేజర్ కంటి సమస్యలతో బాధపడే 83,365 మందికి ప్రిస్కిప్షన్ గ్లాసులు అందించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఫాకో మిషన్ ద్వారా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించగా, ఎక్కువ సమస్య ఉన్న వారిని హైదరాబాద్‌కు పంపించారు.

నర్సింగ్ కళాశాల మంజూరు..

ఈ ఏడాది జిల్లాకు తొలి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల మంజూరు చేశారు. పాలేరు నియోజకవర్గంలో 60 సీట్లతో కళాశాలను కేటాయించగా ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు పూర్తి చేసి తరగతులు ప్రారంభించే అవకాశం ఉంది. ప్రస్తుతం రూరల్ మండలం పెద్దతండా వద్ద విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకు అద్దె భవనం తీసుకోగా, త్వరలో శాశ్వత భవనం అందుబాటులోకి రానుంది. ప్రభుత్వం నర్సింగ్ కళాశాల భవనం కోసం రూ. 25 కోట్లు మంజూరు చేయగా ఖమ్మం రూరల్ మండల మద్దులపల్లి వద్ద నూతన భవన నిర్మాణం జరుగుతోంది. కళాశాల కోసం 5 ఎకరాలు కేటాయించగా, వచ్చే ఏడాది అందుబాటులోకి రానుంది.

అందుబాటులోకి మోకీలు శస్త్ర చికిత్స..

ఇంతవరకు మోకీలు సమస్యలకు జిల్లాలో అంతగా వైద్య సేవలు అందుబాటులో లేక హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. కాగా ఇటీవల పెద్దాస్పత్రిలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అందుకోసం ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌లో ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఈ శస్త్రచికిత్స అత్యంత జాగ్రత్తగా, ఇన్‌ఫెక్షన్ సోకకుండా చేయాల్సి ఉంటుంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ శస్త్ర చికిత్సకు రూ.1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు ఖర్చవుతుంది. మోకీలు శస్త్ర చికిత్సలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోంది.



మోకీలు శస్త్ర చికిత్స అనంతరం మహిళను డిశ్చార్జ్ చేస్తున్న వైద్యులు(ఫైల్)

గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు..

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా గర్భిణుల కోసం న్యూట్రీషన్ కిట్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచేందుకు, కడుపులోని బిడ్డ ఎదుగుదలకు ప్రభుత్వం న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేసింది. గర్భిణులు ప్రసవించే వరకు రెండు దఫాలుగా ఈ కిట్లు అందిస్తున్నారు. ఇందులో ఐరన్ సిరప్, ఖర్జూర, న్యూట్రీషన్ మిక్స్‌డ్ పౌడర్, నెయ్యి, నట్టల నివారణ మాత్రలు ఉంటాయి. ఈ 6 నెలల కాలంలో జిల్లాలో 6 వేల మంది గర్భిణులకు ఈ కిట్లు పంపిణీ చేశారు.



2023 రివైండ్

'సబ్ క్రిటికల్'తో పెరిగిన భారం

- బీటీపీఎస్‌లో పర్యావరణ సమస్యలు
- విద్యుత్ కొనుగోలు బకాయిలు రూ.59,580 కోట్లు
- జమలాపురం ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



భట్టిని గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మణుగూరు రూరల్/ ఎర్రుపాలెం : భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్) నిర్మాణంలో సూపర్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాల్సి ఉండగా, సబ్ క్రిటికల్ టెక్నాలజీని వినియోగించారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఆయన జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి బీటీపీఎస్‌ను సందర్శించారు. కర్మాగారంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి, పని తీరు, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెన్‌కో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి తగిన సూచనలు చేశారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని, కష్టనష్టాలను అధిగమించి విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అంకితభావంతో పని చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై నిష్పక్షపాతంగా శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. సమస్యలను అధిగమించి సమాజానికి మంచి భవిష్యత్ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు.

అప్పుల ఊబిలో రాష్ట్రం

గత ప్రభుత్వం చేసిన అప్పులు, చెల్లించాల్సిన బకాయిలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని భట్టి పేర్కొన్నారు. రాష్ట్ర విభజన నాటికి రూ. 7,259 కోట్ల మాత్రమే బకాయిలు ఉన్నాయని, తొమ్మిదిన్నర ఏళ్లలో గత ప్రభుత్వం రూ 81,516 కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. అనంతరం ఎర్రుపాలెంలో పర్యటించిన భట్టి.. జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రసాదం, శేషవస్త్రాలు అందించి వేదాశీర్వచనం చేశారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ జమలాపురం ఆలయంతో పాటు మామునూరు పేట చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. అవసరమైన ఇతర పనులకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పెద్దగోపవరం క్రాస్‌రోడ్‌లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి భట్టికి ఘన స్వాగతం పలికారు. కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం కార్యాలయ ప్రత్యేక అధికారి కృష్ణభాస్కర్, వైరా, పినపాక ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ అంకసాల శ్రీనివాసరావు, ఎర్రుపాలెం, మధిర మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సూరంశెట్టి కిశోర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి తుమ్మల నాగేశ్వరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారాని కృషి చేస్తామని వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా శనివారం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పట్ల గత ప్రభుత్వంలా తాము నిర్లక్ష్యంగా వ్యవహరించబోమని హామీ ఇచ్చారు. ఉద్యోగులు కోరుకున్నట్టుగా ప్రభుత్వ మార్పు జరిగిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లకు నగదు రహిత వైద్యం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సంఘం నాయకులు పైడిపల్లి శరత్, ఎర్నేని రామారావు, డీకే శర్మ, చెంచురెడ్డి, మారంరాజు రాధాకృష్ణారావు, జనార్దన్, సాంబశివరావు, హుస్సేన్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి జగ్జీవన్ కుమార్

ఖమ్మంలీగల్ : కేసుల ద్వారా వివాదంలో ఉన్న కక్షిదారులు రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకుని సుహృద్భావ వాతావరణంలో జీవించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్ జగ్జీవన్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ఇరుపక్షాల వారిని గెలిపించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని ప్రముఖ వైద్యుడు యూనియన్ బ్యాంక్‌పై దాఖలు చేసిన రెండు సివిల్ కేసుల్లో రాజీ చేసిన న్యాయమూర్తులు లోకదాలత్ అవార్డును జారీ చేశారు.

1,80,652 కేసుల పరిష్కారం

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం1,80,652 కేసులు పరిష్కారం అయ్యాయి. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి మోటార్ ప్రమాద కేసులను విచారించి 91 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.1.77 కోట్ల పరిహారం ఇప్పించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.ఆశారాణి బ్యాంకు, సివిల్ తగాదాలు పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మహమ్మద్ అబ్దుల్ జావిద్ పాషా, నాగశ్రావ్య, కె.దీప, వి.మాధవి, ఆర్.శాంతి లత, ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ సలీం పాషా, న్యాయవాదులు లక్ష్మీనారాయణ, విజయ రాఘవ, అమర్‌నాథ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టర్ వీ.పీ. గౌతమ్



మధిర గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వీ.పీ. గౌతమ్

మధిర : ప్రజాపాలన కార్యక్రమంలో నిర్వహిస్తున్న గ్రామసభల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ సూచించారు. మధిర 6వ వార్డు మడుపల్లి గ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల వద్దకే పాలన తీసుకరావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు నిర్వహించిన గ్రామసభల్లో 60వేలకు పైగా దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇచ్చే రశీదును జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. ఆధార్ సవరణలు అవసరం లేదని, ప్రస్తుతం ఉన్న కార్డు జిరాక్స్ మాత్రమే జతపర్చాలని చెప్పారు. ఇప్పటికే పెన్షన్ వస్తున్న వారు ఆ కాలమ్‌ను నింపనవసరం లేదని, అర్హత ఉండి పెన్షన్ రాని వారు మాత్రమే చేయూత పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటిస్థలం ఉన్నవారు, లేనివారు కూడా ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేయాలని చెప్పారు. రైతు భరోసాలో సాదాబైనామాలో భూమి ఉన్నవారు సర్వే నంబర్, రెవెన్యూ శివారు, విస్తీర్ణాన్ని పొందుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, కమిషనర్ రమాదేవి, వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ దరఖాస్తులు..

ఖమ్మంఅర్బన్/ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండల కేంద్రంతో పాటు ఖమ్మం నగరంలోని 14వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ గౌతమ్ సందర్శించారు. అడిగిన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు ఫారాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుతో ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లను మాత్రమే జతచేయాలని, ఒక ఫొటో అతికించాలని సూచించారు. ఏదైనా అనుమానం ఉంటే కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కుల్లో సంప్రదించాలన్నారు. ఎర్రుపాలెం మండలంలో ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ బి. శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మూడోరోజు 58,330 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో డీఈఓ సోమశేఖర శర్మ, కార్పొరేటర్ కూరాకుల వలరాజు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్ పాల్గొన్నారు. కాగా, 15వ డివిజన్‌లో కార్పొరేటర్ రావూరి కరుణ సైదబాబు ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు.

సంకటంలో సాగు..

ఈ ఏడాది కలిసిరాని కాలం

- సాధారణంలో సగం కూడా నమోదు కాని వర్షపాతం
- పత్తికి ప్రతికూలం, వరిపై తుపాను ప్రభావం
- ఏడాదంతా రైతులకు నష్టాలే..



మిచాంగ్ తుపానుతో నేలవాలి దెబ్బతిన్న వరి



తుపాను కారణంగా పడిపోయిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: అన్నదాతకు ఈ ఏడాది ఎంత మాత్రం కలిసిరాలేదు. పంటల సాగుకు ప్రధానమైన వర్షాలు కురవకపోవటం తీవ్రంగా దెబ్బతీసింది. జూన్ నుంచి నవంబర్ వరకు జూలై మినహా మిగిలిన నెలల్లో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిశాయి. ప్రధానంగా జూన్‌లో అతి తక్కువగా వర్షాలు కురిశాయి. ఈ ప్రభావంతో మెట్ట పంటల సాగు గణనీయంగా తగ్గింది. జూలైలో మాత్రం వర్షాలు ఆశాజనకంగా కురవడంతో రైతులు వరినార్లు పోసుకోవటంతో పాటు సాగుకు సన్నద్ధమయ్యారు. మిర్చినార్లు కూడా పోశారు. ఇక ఆగస్టు నుంచి అక్టోబర్ వరకూ సాధారణ స్థాయిలో కూడా వానలు కురవలేదు. గతేడాది జలాశయాల్లో ఉన్న నీరు, ఈ ఏడాది కురిసిన అరకొర వర్షాలతో 5,24,729 ఎకరాల్లో పంటలు సాగు చేయగా, మరో 1,89,152 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది పత్తి దిగుబడి గణనీయంగా తగ్గగా, తామర పురుగు మిర్చి పంటను దెబ్బతీసింది. భారీ పెట్టుబడులతో వరి దిగుబడి కొంత మేరకు ఆశాజనకంగా ఉన్నా.. చివరిలో 'మిచాంగ్' తుపాను రైతులను దెబ్బతీసింది. ఉద్యాన పంటల్లో ఆయిల్ పామ్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ పంటలకు ప్రోత్సాహకాలు కూడా ఇస్తుండటంతో రైతులు సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక వానలు లేకపోవడంతో యాసంగి సాగుపైనా మరింత ప్రభావం పడింది.

తగ్గిన పత్తి.. మిర్చిని దెబ్బతీసిన నల్లి..

వర్షాలు లేక పంటల సాగు తగ్గింది. ప్రధానంగా పత్తి సాగు గణనీయంగా తగ్గింది. గత ఏడాది 2.21 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పత్తి సాగు ఈ ఏడాది 1.87 లక్షల ఎకరాలకే పరిమితమైంది. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడులు రావాల్సిన పంట కేవలం 4 నుంచి 5 క్వింటాళ్లకు మించి రాలేదు. అంతేగాక ధరలు కూడా బాగా దెబ్బతీస్తున్నాయి. పత్తి రైతులు దిగుబడి, ధరలో బాగా నష్టపోయారు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. వరి గతేడాది 2.89 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 2.82 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. దిగుబడి ఆశాజనకంగా ఉంటుందనుకున్న తరుణంలో తుపాన్ దెబ్బతీసింది. అయితే ధర బాగానే ఉండడం రైతులకు కొంత కలిసి వచ్చింది. సన్న రకాలు రూ.3వేలు, ఆ పైన ధరలతో ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మిర్చికి కూడా ధర బాగానే పలుకుతుండటంతో రైతులు పంట సాగుకు ప్రాధాన్యం ఇచ్చారు. గత ఏడాది 62 వేల ఎకరాలు కాగా ఈ ఏడాది 92 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సాగు విస్తీర్ణం పెరిగినా తామర పురుగు ఈ పంటను తీవ్రంగా నష్టపరుస్తోంది. అయితే ధర మాత్రం క్వింటా రూ. 23,500 వరకు పలుకుతోంది. ఇతర పంటల సాగు కూడా తగ్గింది.

పంటలపై తుపాను ప్రభావం

వానాకాలం పంటలు చేతికందే సమయంలో ఈనెల మొదటి వారంలో వచ్చిన తుపానుతో జిల్లాలో 53,903 మంది రైతులకు చెందిన 82,191 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 39,276 మంది రైతులకు చెందిన 59,307 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించింది. పత్తి 368 మంది రైతులకు చెందిన 348 ఎకరాలు, మిర్చి 11,225 మంది రైతులకు చెందిన 17,267 ఎకరాలు, మొక్కజొన్న 3,031 మంది రైతులకు చెందిన 5,262 ఎకరాలు, మినుము ముగ్గురు రైతులకు చెందిన 7 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు.

అంతా నిరాశే...



వానలు సక్రమంగా కురవ లేదు. నీటి వనరులున్న ప్రాంతాల్లో పంటలను సాగు చేస్తే చేతికందే దశలో మిచాంగ్ తుపాను దెబ్బతీసింది. తుపానుకు 6ఎకరాల్లో సాగు చేసిన వరి నేలవాలి దెబ్బతిన్నది. రెండు రోజుల్లో పంట చేతికందుతుందని ఎంతో ఆశతో ఉన్న సమయంలో తుపాను నష్టపర్చింది. – ఆవతి రామారావు, అన్నారుగూడెం

సాగు, పంటలూ అంతంతే...



వానలు లేకపోవటంతో పూర్తి స్థాయిలో పంటలు సాగు చేయలేకపోయాం. నీటినరులున్న భూముల్లో పంటలు వేస్తే అంతంత మాత్రంగానే దిగుబడులు వచ్చాయి. పత్తి ఎకరాకు 4నుంచి 5 క్వింటాళ్లకు మించలేదు. మిర్చి పంటను తామరపురుగు వెంటాడుతోంది. ఎకరాకు 15 క్వింటాళ్లకు మించి దిగుబడులు రావడం లేదు. కౌలు రైతుల పరిస్థితి మరింతగా దయనీయంగా ఉంది.
– వేల్పుల రామయ్య, పోలిశెట్టిగూడెం

వర్షపాతం తగ్గింది...



ఈ ఏడాది వర్షపాతం తగ్గింది. జూన్‌లో వర్షాలు సాధారణం కన్నా తక్కువగా కురిశాయి. జూలైలో కురిసిన వర్షాలు మాత్రం పంటల సాగుకు కొంత ప్రయోజనం కలిగించాయి. వరి దిగుబడి ఆశాజనకంగానే ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ మార్కెట్‌లో ధరలు బాగున్నాయి. యా సంగిలో నీటివనరులున్న ప్రాంతాల్లో ఆరుతడి పంటలు సాగు చేయడం మేలు.
– ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

పల్లె దవాఖానాలో కేంద్ర బృందం



పల్లె దవాఖానా వైద్యురాలితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

కొణిజర్ల: మండలంలోని పెద్దమునగాల పల్లె దవాఖానాను శనివారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. బృందం సభ్యులైన డాక్టర్ సుమన్, డాక్టర్ సన ఆస్పత్రిలో రోజువారీ ఓపీ, అందుబాటులో ఉన్న మందులతో పాటు రిజిస్టర్లను పరిశీలించారు. ఆ తర్వాత నేషనల్ స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రాథమిక పాఠశాలను సందర్శించి చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే, పెద్దగోపతి పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు, వైద్యులు రమేశ్, తేజస్విని, సిబ్బంది పాల్గొన్నారు.

బోదులబండలో తాటి చెట్లు నరికివేత



బోదులబండలో నరికిన తాటి చెట్లు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామంలో ఇద్దరు రైతులకు చెందిన పొలంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తులు తాటి, వేప చెట్లను నరికారని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నారాయణ, నాగేశ్వరరావుకు చెందిన భూమిలో ఉన్న ఐదు తాటి చెట్లు, మూడు వేప చెట్లను అదే గ్రామానికి చెందిన వ్యక్తి అర్ధరాత్రి కొంత మంది కూలీలను ఏర్పాటు చేసి యంత్రాలతో నరికించాడు. దీంతో బాధిత రైతులు నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని సీఐ కుమ్మరి పోశెట్టి తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి



రామిరెడ్డి (ఫైల్)

కొణిజర్ల: పొలం పనులకు వెళ్లి వచ్చిన ఓ రైతు గుండెపోటుతో ఇంట్లో తుదిశ్వాస విడిచాడు. కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగు పంచాయతీ పరిధి సిద్ధిక్ నగర్‌కు చెందిన శాఖం రామిరెడ్డి (45) శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. అలసటగా ఉందని చెబుతూ అలాగే పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిద్దామని ప్రయత్నిస్తుండగానే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

నాకు ప్రాణ హాని ఉంది

- సోషల్ మీడియా ద్వారా పోలీసులకు ఫిర్యాదు

నేలకొండపల్లి: తనను చంపేందుకు గ్రామంలో కొందరు బీఆర్ఎస్ నాయకులు కుట్ర పన్నుతున్నారని యూత్ కాంగ్రెస్ నాయకుడు కొమ్మినేని విజయ్‌బాబు సోషల్ మీడియా ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని కోనాయిగూడెంనకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు కొమ్మినేని విజయ్‌బాబు శనివారం సోషల్ మీడియా ద్వారా పలు ఆరోపణలు చేస్తూ పోస్టు చేయటంతో వైరల్‌గా మారింది. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయుకులు తనను చంపేందుకు కుట్ర పన్నుతున్నారని పలువురు పేర్లను ప్రస్తావించాడు. తన కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌పై దాడి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్‌పై శనివారం ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. త్రీటౌన్ సీఐ మురళి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పట్టణ పరిధిలోని 2వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమం జరుగుతుండగా.. దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన అదే ఏరియాకు చెందిన ఉమా, శ్రీను, మరో మహిళా కలిసి వైస్ చైర్మన్ దామోదర్‌పై దాడి చేశారు. ఈనేపథ్యాన తనపై దాడి చేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ దాడి ప్రజాపాలన కార్యక్రమంలో జరగడంతో అక్కడకు వచ్చిన వారికి, పని చేసే సిబ్బంది కొంత సమయం అసౌకర్యం కలిగింది. దాడి వ్యక్తిగత కక్షతో జరిగినట్లు తెలుస్తోంది.

మిర్చి రైతు ఆత్మహత్య

ఇల్లెందు: రెండెకరాల మిర్చి తోట సాగు చేయగా ముడత తెగుళ్లు వచ్చి పంట పూర్తిగా నష్టపోవడంతో మనస్థాపం చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని అందుగులబోడులో శనివారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తోలెం నరేశ్(35) తన రెండెకరాల్లో మిర్చి తోట సాగు చేశాడు. ఈనేపథ్యాన తోటకు ముడత తెగుళు వచ్చి చేనంతా చెడిపోయింది. దీంతో మనస్థాపం చెందిన నరేశ్ శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై నరేశ్ సోదరుడు తోలెం సురేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేలకొండపల్లి మండలంలో నాట్లు వేస్తున్న బెంగాల్ కూలీలు



నీట్‌గా నాట్లు !

సాక్షి, ఖమ్మం డెస్క్:

యాసంగి లేదా ఖరీఫ్.. పంట సీజన్ వస్తుందంటే వరి సాగు చేసే రైతుల్లో ఆందోళన మొదలవుతుంది. వరి నారు సిద్ధం చేసుకోవడం ఒక ఎత్తయితే నాట్లు వేయించడం వారికి తలకు మించిన భారంగా మారుతోంది. గతంలో ఈ పరిస్థితి లేకున్నా కూలీల కొరతతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరగడం, ఉపాధి హామీ పథకం అందుబాటులోకి రావడంతో కూలీలు వ్యవసాయ పనులకు రావడం తగ్గించేశారు. దీంతో ఉన్న కూలీలతో రైతులంతా వరి నాట్లు వేయించడం కష్టమవుతోంది. కూలీల లభ్యత లేక రైతులంతా పోటీ పడుతుండడం, ఇంకో పక్క నారు ముదిరే ప్రమాదం ఉండడంతో ఎంత ఖర్చయినా భరించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అయినా పనులు ముందుకు సాగక అవస్థ పడుతున్న నేపథ్యాన మేమున్నాం.. అంటూ పశ్చిమబెంగాల్‌కు చెందిన కూలీలు వారికి అండగా నిలుస్తున్నారు. ఏటా పంట సీజన్లలో కుటుంబాలతో వస్తున్న బెంగాల్ కూలీలు పొద్దంతా వరి నాట్లు వేస్తూ చకచకా పని ముగిస్తుండడంతో రైతుల బెంగ తీరినట్లవుతోంది.

ఏటా రాకపోకలు

కొన్నాళ్లుగా పశ్చిమబెంగాల్‌కు చెందిన కూలీలు ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు వస్తున్నారు. ఈ జిల్లాల్లో సాగర్ ఆయకట్టు ఉండడం, మిగతా ప్రాంతాలతో పోలిస్తే తొందరగా వరి నాట్లు వేయాల్సి ఉండడంతో ఖరీఫ్, రబీ సీజన్లలో కుటుంబాలతో చేరుకుంటారు. ఒక మండలాన్ని ఎంచుకుని గ్రామాలకు వెళ్లి అక్కడే 30 నుంచి 50 మంది పిల్లాపాపలతో సహా స్థావరం ఏర్పాటుచేసుకుంటారు. అక్కడే వంటావార్పు చేసుకుంటూ ఉదయం లేచింది పొద్దు పోయే వరకు నాట్లు వేయడంలో బిజీగా గడుపుతారు. ఒక గంట కూడా పని ఆపకుండా నాట్లు వేస్తుండడంతో త్వరగా పని ముగుస్తోంది. దీంతో రైతులంతా వీరి కోసం ఆరాటపడుతూ ముందుగానే డబ్బు చెల్లించి బుకింగ్ చేసుకుంటుండడం విశేషం. ఒక్కో మండలంలో నాట్లు కాగానే పక్క మండలాలకు బయలుదేరతారు.

చకచకా పని..

సాధారణంగా స్థానిక కూలీలను వరి నాట్లు వేసేందుకు మాట్లాడుకుంటే ఉదయం 9గంటల వరకు పనికి వస్తారు. ఆతర్వాత మధ్యాహ్నం గంట పాటు భోజనం విరామం తీసుకుని సాయంత్రం ఐదు గంటలకల్లా ఇళ్లకు బయలుదేరతారు. వీరికి కొందరు రైతులు డిమాండ్ ఆధారంగా రవాణా సదుపాయం కూడా సమకూర్చాల్సి ఉంటుంది. కానీ బెంగాల్ కూలీల విషయానికొచ్చే సరికి పంట పొలాల వద్దే గుడారాలు వేసుకుని అక్కడే వంటావార్పు చేసుకుంటారు. జట్టులో కొందరు వంట, ఇతర పనులు చేస్తుండగా మిగతా వారు ఉదయమే నాట్లు వేయడం మొదలుపెడతారు. అలా సాయంత్రం వరకు కొందరు విరామం తీసుకున్నా మిగతా వారు పని కానిచ్చేస్తుంటారు. దీంతో ఎక్కడా ఆగకుండా నాట్లు వేయడం పూర్తవుతుంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలంలో ఈ కూలీలు వరి నాట్లు వేస్తుండగా, ఇక్కడ పని పూర్తికాగానే సరిహద్దున ఉన్న ఏపీకి వెళ్లామని తెలిపారు.

రోజుకు ఐదెకరాలకు పైగా

స్థానిక కూలీలు పది మంది వస్తే రోజుకు రెండు నుంచి మూడెకరాల్లో వరి నాట్లు వేస్తారు. అదే బెంగాల్ కూలీలు పది మంది జట్టుగా ఉండగా... రోజులో ఐదు నుంచి ఆరు ఎకరాల్లో వరి నాట్లు పూర్తి చేస్తుండడం విశేషం. ఇక నాట్లు వేసే విధానాన్ని పరిశీలిస్తే స్థానిక కూలీలు సంప్రదాయ విధానంలో ముందుకు సాగుతారు. తద్వారా మందుల పిచికారీ సమయాన రైతు కాస్త ఇబ్బంది పడాల్సి ఉంటుంది. కానీ బెంగాల్ కూలీలు మాత్రం తాడు కట్టుకుని వరుస ప్రకారంలో నాట్లు వేస్తుండడం, కాలిబాటలు వదులుతుండడంతో రైతులకు సస్యరక్షణ చర్యలు చేపట్టడం సులువవుతోందని చెబుతున్నారు. కాగా, కూలీ విషయానికి వస్తే స్థానికులు, బెంగాల్ కూలీలు ఎకరాకు రూ.4వేల వరకు తీసుకుంటున్నా పని త్వరగా ముగుస్తుండడం రైతులు స్వచ్ఛందంగా బెంగాల్ కూలీల వంటకు కావాల్సిన సరుకులు కూడా సమకూరుస్తున్నారు.



ఏటా నాట్లు వేసేందుకు వస్తాం...



మా దగ్గర పనులు పెద్దగా దొరకవు. అందుకే వ్యవసాయ పనులు చేసేందుకు ఏటా తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాలకు సీజన్‌లో వస్తుంటాం. నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో వరి నాట్లు ముందుగా మొదలవుతాయి. అందుకే కుటుంబాలతో సహా ఇక్కడకు వచ్చి నాట్లు వేస్తాం. ఆతర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలకు వెళ్తాం. మొత్తంగా రెండు, మూడు నెలల పాటు ఇక్కడే ఉంటాం.

– సోషాన్ మోండల్, పశ్చిమబెంగాల్

కుటుంబమంతటికీ ఉపాధి



దాదాపు 30 మందిమి ప్రతీ సీజన్‌లో తెలంగాణ నాట్లు వేసేందుకు వస్తాం. మా కుటుంబాలన్నింటికీ ఇక్కడ పనికి ఢోకా ఉండదు. సీజన్‌లో కనీసం మూడు నెలల పాటు చేతి నిండా పని దొరకడమే కాక కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా డబ్బు చేతికి అందుతుంది. తెలుగు రాష్ట్రాల రైతులు మాకు పని ఇవ్వడమే కాక గౌరవంగా చూస్తారు. ఇక్కడి రైతులకు మేం ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– శంకరి సర్దార్, పశ్చిమబెంగాల్

మూడు నెలలు ఢోకా లేదు..



ఏటా మాకు తెలుగు రాష్ట్రాల్లో ఉపాధి లభిస్తోంది. అందుకే కుటుంబాలతో సహా రెండు సీజన్లలో గుంపుగా వస్తాం. ఇక్కడ రెండు నెలల పాటు వరి నాట్లు వేసేందుకు ఉపాధి దొరుకుతుంది. తొలినాళ్లలో కొందరమే రాగా.. ఇప్పుడు ఇక్కడకు రావడానికి మరికొందరు ఇష్టపడుతున్నారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో నాట్లు వేయడం పూర్తయ్యాక పక్కనే ఉన్న ఏపీకి వెళ్లి మా రాష్ట్రానికి బయలుదేరతాం.

– మేరీనాల్ మోండల్, పశ్చిమ బెంగాల్

అనుమతి ఇవ్వకపోతే ఆత్మహత్యే..

చెరకు తోట వద్ద రైతు నిరసన

నేలకొండపల్లి: స్థానిక చక్కెర కర్మాగారానికి చెరకు సరఫరా చేయడానికి ఓ రైతుకు అనుమతి ఇవ్వలేదు. దీంతో సదరు రైతు శనివారం చెరకు తోట వద్ద నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యం వెంటనే అనుమతి ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన రైతు ఎర్రబోయిన శ్రీనివాసరావు తనకున్న ఎకరం పొలంలో చెరకు సాగు చేశాడు. ఈ క్రమంలో పక్కన రైతులు నాట్లు వేసేందుకు దుక్కులు దున్ని సిద్ధమవుతున్నారు. అయితే, చెరకును నరికిన తర్వాత వారి పొలాల మీదుగానే తరలించాల్సి ఉంది. వేరే దారి లేకపోవడంతో శ్రీనివాసరావు చెరకు కర్మాగారం యాజమాన్యం వద్దకు వెళ్లి విషయం చెప్పాడు. ఇప్పుడు చెరకు తరలించకపోతే ఎకరం చెరకు తోటను అక్కడే వదిలేయాల్సిందేనని వాపోయాడు. దీంతో యాజమాన్యం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రైతు ఆమేరకు అర్జీ పెట్టుకోవడంతో యాజమాన్యం చెరకును క్రషింగ్‌కు తీసుకొచ్చేందుకు అనుమతి ఇచ్చింది. రైతు అధిక కూలీ రేట్లు చెల్లించి శనివారం చెరకు నరికివేతను ప్రారంభించాడు. విషయం తెలుసున్న ఫ్యాక్టరీ అధికారులు నరికివేతను నిలిపివేశారు. దీంతో రైతు శ్రీనివాసరావు చెరకు తోటలోనే బోరున విలపించారు. కొట్టిన చెరకు కర్రపై పడుకుని నిరసన తెలిపారు. అప్పులు చేసి, కష్టాలు ఎదుర్కొని సాగు చేస్తే ఇబ్బందులు పెడుతున్నారని, తనకు వెంటనే అనుమతి ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. సహచర రైతులు సముదాయించి రైతును ఇంటికి తీసుకెళ్లారు. ఈ విషయంపై ఫ్యాక్టరీ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.



రాజేశ్వరపురంలో నరికిన చెరకు



పొలం వద్ద రోదిస్తున్న రైతు శ్రీనివాసరావు

‘లకారం’లో సిబ్బంది చేతివాటం

ఆదాయానికి గండి పడుతున్నా పట్టనట్లుగా అధికారులు



సిబ్బందిని ప్రశ్నిస్తున్న కార్పొరేటర్, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా లకారం ట్యాంక్ బండ్‌ను రూ.కోట్లు వెచ్చించి ఆధునికీకరించారు. ఇకక్కడ సస్పెన్షన్ బ్రిడ్జిని నిర్మించగా, దీని నిర్వహణ, లకారంను పరిశుభ్రంగా ఉంచేందుకు కేఎంసీ నుంచి నిధులను కేటాయిస్తున్నారు. ఇదే సమయాన బ్రిడ్జి పైకి వెళ్లే వారి నుంచి టికెట్ రూపంలో నగదు వసూలు చేసి లకారం అభివృద్ధికి వెచ్చిస్తున్నారు. అయితే, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో లకారంపై విధులు నిర్వర్తించే సిబ్బంది అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. బ్రిడ్జిపైకి 80 మంది సందర్శకులు వెళ్తే 10 నుంచి 20 మంది సందర్శకులే వచ్చారని సిబ్బంది లెక్కలు చూపిస్తూ అంతే మొత్తం కేఎంసీ కార్యాలయంలో జమ చేస్తున్నారు. మిగతా సందర్శకులు చెల్లించిన నగదును తమ జేబుల్లో నింపుకుంటున్నారన్న విమర్శలున్నాయి. శుక్రవారం రాత్రి పలువురు కార్పొరేటర్లు ట్యాంక్ బండ్ సందర్శనకు వెళ్లగా ఈ ఘటన వెలుగు చూసింది. కాగా, ట్యాంక్‌బండ్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం 20 మంది కార్మికులను కేటాయింగా ఐదుగురినే పనిలో ఉంచి అందరూ పని చేసినట్లు ఇద్దరు కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేస్తుండగా కొందరు ఉద్యోగులు సహకరిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కాంగ్రెస్ కార్పొరేటర్ కమర్తపు మురళి, మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు శనివారం ఈ విషయమై కేఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కేఎంసీ ఆదాయానికి గండి కొడుతున్న వారితో పాటు సహకరిస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బడిబయట పిల్లల సర్వే పరిశీలన



రొటవేటర్ అందజేస్తున్న రాజశేఖర్

కల్లూరురూరల్: బడికి వెళ్లకుండా ఉన్న పిల్లల సర్వేను సీఆర్‌పీలు నిర్వహిస్తుండగా శనివారం జిల్లా విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. చంద్రుపట్ల గ్రామంలో మానసిక వైకల్యం కలిగిన తిప్పారెడ్డి చైతన్యకు రొటవేటర్‌ను అందజేశారు. హైస్కూల్ తరగతులు నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎండీ ఆరీఫ్, సృజన పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’ను పరిశీలించిన అదనపు కలెక్టర్



గ్రామసభను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్

కారేపల్లి: మండలంలోని దుబ్బాతండా గ్రామ పంచాయతీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం పర్యటించి ప్రజాపాలన గ్రామసభలను పరిశీలించారు. తహసీల్దార్ వి.సురేశ్‌కుమార్ పంచాయతీలో రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. దీంతో లబ్ధిదారులు పూర్తి వివరాలను ఎలాంటి హడావుడి లేకుండా నమోదు చేసి, అవసరమైన పత్రాలు జతచేసి, అధికారులకు అందజేశారు. దుబ్బతండాలో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ దరఖాస్తుదారులు క్యూలైన్‌లో నిల్చోవడంతో వారిని కూర్చోబెట్టాలని చెప్పారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, మేకలతండాలో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను పరిశీలించారు. దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్రి, కార్యదర్శి స్రవంతి పాల్గొన్నారు.

బియ్యం బస్తాలతో ఆటోడ్రైవర్ పరారీ

ఖమ్మంక్రైం: హోటల్ యజమానిని మోసం చేసి బియ్యం బస్తాలతో ఆటోడ్రైవర్ పరారైన ఘటన ఖమ్మం నగరంలో శనివారం చోటు చేసుకుంది. స్టేషన్‌రోడ్‌లోని బామ్మ మెస్ నిర్వాహకులు శ్రీహరి పాత మున్సిపాలిటీ కార్యాలయం ప్రాంతంలో రెండు క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేశాడు. అటుగా వెళ్తున్న ఆటోను కిరాయికి మాట్లాడుకుని, అందులో బియ్యం బస్తాలు వేసి ద్విచక్రవాహనంపై వెనుక బయలుదేరాడు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆటోడ్రైవర్ శ్రీహరిని దారి తప్పించి బియ్యం బస్తాలతో సహా పరారయ్యాడు. శ్రీహరి ఆ చుట్టుపక్కల అంతా వెతికినా ఆచూకీ లభించలేదు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీసీ కెమెరా పుటేజీ పరిశీలించి విచారణ చేస్తున్నారు.

దోపిడీ లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

- చీలికలు కమ్యూనిస్టులను బలహీనపర్చాయి..
- సీపీఐ ఆవిర్భావ సభలో కూనంనేని సాంబశివరావు
- ఖమ్మంలో భారీసంఖ్యలో శ్రేణులతో కవాతు



ఖమ్మంలో కవాతు చేస్తున్న రెడ్ షర్ట్ వలంటీర్లు



సభలో మాట్లాడుతున్న సాంబశివరావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దోపిడీ లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఖమ్మంలో జనసేవాదళ్ కవాతు నిర్వహించారు. ఖమ్మంలోని పెవిలియన్ మైదానం నుంచి 99 మంది రెడ్ షర్ట్ వలంటీర్లు పార్టీ పతాకాలతో ముందుకు సాగుతుండగా, వందలాది మంది రెడ్ షర్ట్ వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం ఇందిరానగర్ సీపీఐ పైలాన్ వద్ద పతాకాన్ని పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు మహ్మద్ మౌలానా ఆవిష్కరించాక జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడారు. అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం కమ్యూనిస్టు భావజాలం కలిగిన వారు పరితపించారని గుర్తు చేశారు. సామాజిక వివక్షతకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటాలు నిర్వహించిన కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర అని తెలిపారు. అయితే, చీలికలు కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలహీన పర్చాయని, లేకుంటే కమ్యూనిస్టు పురోగమనం మరో రకంగా ఉండేదని సాంబశివరావు చెప్పారు. కాగా, ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా విప్లవ పార్టీగా తాము ముందుకు సాగుతున్నామన్నారు. ఇటీవల సింగరేణి ఎన్నికల్లో రూపాయి ఖర్చు లేకుండా ఏఐటీయూసీ ఘన విజయం సాధించిందని తెలిపారు. రానురాను కమ్యూనిస్టులకు ఆదరణ పెరుగుతోందని, స్వార్థపూరిత శక్తులు పార్టీలను వీడినా నిజమైన కమ్యూనిస్టులు ఎప్పుడు ఎర్ర జెండా నీడనే ఉంటారని కూనంనేని స్పష్టం చేశారు. ఈ సభలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, మహ్మద్ మౌలానా తదితరులు మాట్లాడగా నాయకులు దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, జానీమియా, యర్రా బాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, మేకల శ్రీనివాస్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, జనసేవాదళ్ కార్యకర్తలు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

రామాలయం ఆవరణలో వంట షెడ్ కూల్చివేత



ఆలయ ఆవరణలో గదిని కూల్చివేస్తున్న దృశ్యం



గదిని కూల్చివేశాక పంచనామ రాస్తున్న ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం బైపాస్ రోడ్డు పక్కన కొత్త బస్టాండ్ సమీపాన రామాలయం ఆవరణలో ఉన్న వంటశాల షెడ్‌ను రెవెన్యూ, కేఎంసీ టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు శనివారం కూల్చివేయించారు. రామాలయం ఆవరణలో ఉన్న వంటశాల షెడ్‌కు అక్రమంగా అసెస్‌మెంట్ నంబర్ వేసి, ఆ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని 59 జీఓ ద్వారా కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదులు అందడంతో విచారణ జరిపించారు. ఈ మేరకు తప్పుడు అసెస్‌మెంట్ నంబర్లతో ఆలయ ఆవరణలోని గదిని చూపించి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు గుర్తించగా శనివారం తొలగించారు. గదికి తాళం వేసి ఉండటంతో పగలగొట్టి, లోపల ఉన్న సామగ్రిని బయట పెట్టి జేసీబీతో కూల్చివేయించారు. కాగా, ఎప్పటి నుండో ఉన్న గదిని తొలగించడం సరికాదని, స్థలం అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగితే రద్దు చేయాలే తప్ప ఆలయ గదిని తొలగించడమేమిటని స్థానికులు ప్రశ్నించారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నాం..

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, ఆ భూమిని స్వాధీనం చేసుకున్నామని కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఖమ్మం బైపాస్ రోడ్డులోని రామాలయం వద్ద రెండు గదులు, హాల్ నిర్మాణానికి సంబంధించి ఆ స్థలానికి సంబంధంలేని మరో ఆస్తి ఆధారాలతో విచారణ అధికారిని తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. ప్రభుత్వ జీఓ 59 ద్వారా అక్రమంగా 415 గజాల ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరణ చేయించుకున్న కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య భర్త నాగరాజు రిజిస్ట్రేషన్‌ను రద్దు పరిచామని తెలిపారు. అలాగే, భూమి రక్షణ చర్యలు చేపట్టామని కలెక్టర్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్ శ్రీవిద్యపై కేసు

ఖమ్మంక్రైం: తప్పుడు ఆధారాలతో జీఓ 59 కింద విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించినందుకుగాను బీఆర్ఎస్ కార్పొరేటర్ శ్రీవిద్యపై శనివారం రాత్రి టూటౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. సీఐ కుమారస్వామి కథనం ప్రకారం.. తప్పుడు ఆధారాలు సృష్టించి బైపాస్‌రోడ్డులోని రామాలయం వద్ద ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని ధర చెల్లించి రిజిస్ట్రేషన్ ద్వారా కార్పొరేటర్ శ్రీవిద్య క్రమబద్ధీకరించుకున్నారు. ఆ స్థలంలో రెండు గదులు, హాల్ నిర్మాణం సైతం చేశారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్ ఫిర్యాదు మేరకు శ్రీవిద్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తను నరికిన కోడలు..

ఇల్లెందు: చిలికి చిలికి గాలి వానలా మారిన అత్తా కోడళ్ల మధ్య ఘర్షణ చివరకు అత్తమీద కోడలు కత్తిపీటతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచేలా చేసింది. శనివారం సాయంత్రం పట్టణంలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని 2వ వార్డు ఇల్లెందులపాడుకు చెందిన అత్త శివారపు లలితమ్మ, కోడలు మౌనికలు శనివారం సాయంత్రం గొడవపడ్డారు. ఈక్రమంలో ఇరువురు ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఆగ్రహంతో అత్తపై కోడలు కత్తిపీటతో తలమీద నరికింది. దీంతో లలితమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మానికి తరలించగా.. ఈ సంఘటన ఇల్లెందులపాడులో సంచలనంగా మారింది.

క్లుప్తంగా...

జనవరిలో 'తిరుమల' విశేష పర్వదినాలు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి నెలలో జరగనున్న విశేష పర్వదినాల వివరాలను టీటీడీ పీఆర్వో విభాగం శనివారం ప్రకటించింది. 1న పెద్దశాత్తు మొర, వైకుంఠ ద్వార దర్శనం ముగింపు, 5న అధ్యయనోత్సవాల ముగింపు, 6న తిరుమల శ్రీవారు తిరుమలనంబి సన్నిధికి వేంచేపు, 7న సర్వఏకాదశి, 9న తొండరడిప్పొడియాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 14న భోగిపండుగ, ధనుర్మాసం ముగింపు, 15న మకర సంక్రాంతి, సుప్రభాత సేవ పునఃప్రారంభం, 16న తిరుమల శ్రీవారు పార్వేట మండపానికి వేంచేపు, కనుమ పండుగ, 25న శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి, 28న తిరుమొళిశైయాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 31న కూరత్తాళ్వార్ వర్ష తిరునక్షత్రం జరగనున్నాయి.

శ్రీశైల దేవస్థానంలో 'ప్రాతః కాలసేవ'

- జనవరి 3 నుంచి అమలు
- ఆన్‌లైన్‌లో రోజుకు 5 టికెట్లు మాత్రమే



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానంలో జనవరి 3వ తేదీ నుంచి స్వామి అమ్మవార్లకు నూతనంగా ప్రాతఃకాల ఆర్జిత సేవ అందుబాటులోకి రానుంది. రోజుకు ఐదు టికెట్లు అందుబాటులో ఉండనుండగా, సేవా రుసుం రూ.25,116గా నిర్ణయించారు. టికెట్లు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే విక్రయిస్తారు. ఈ సేవలో దంపతులు లేదా ఒకరికి మాత్రమే అనుమతి. 10 సంవత్సరాల్లోపు పిల్లలుంటే మల్లికార్జున స్వామి వారి స్పర్శదర్శనం మాత్రమే కల్పిస్తారు. సేవలో భాగంగా మొత్తం ఆరు సేవలను నిర్వహించుకోవచ్చు. దీనిపై దేవస్థాన ఈఓ డీ పెద్దిరాజు మాట్లాడుతూ భక్తుల సూచనలు, సలహా మేరకు ఈ ఆర్జిత సేవను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే

ఎక్కువ మందికి పెన్షన్లు ఇచ్చేది కూడా మనందరి ప్రభుత్వమే

- పెన్షన్ రూ.3 వేలకు పెంపు సందర్భంగా లబ్ధిదారులకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ



సాక్షి, అమరావతి: అవ్వాతాతలకు దేశంలో రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్ అని, ప్రజలందరి ఆశీస్సులతోనే ఇదంతా చేయగలుగుతున్నాని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నుంచి మొదలయ్యే పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వం అవ్వాతాతల పెన్షన్ మొత్తాన్ని రూ.3,000కు పెంచుతున్న సందర్భంగా ఆయన రాష్ట్రంలో దాదాపు 66 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులకు లేఖలు రాశారు. ఒకటవ తేదీన వలంటీర్లు లబ్ధిదారులకు పెరిగిన పెన్షన్ డబ్బులు అందజేస్తూ, వారికి ముఖ్యమంత్రి రాసిన లేఖ ప్రతులను అందజేయనున్నారు. ఇప్పటికే ఆ లేఖల ముద్రణ పూర్తయి, జిల్లాల వారీగా వాటిని చేర్చే ప్రక్రియను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పూర్తి చేసింది. దేశంలో ఎక్కువ మందికి పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వం కూడా మన ప్రభుత్వమేనని, మనందరి ప్రభుత్వమే ఇవన్నీ చేయగలుగుతోందని చెప్పడానికి సంతోషిస్తున్నట్టు సీఎం జగన్ ఆ లేఖలో తెలిపారు. దేవుడి దయతో, మీ అందరికి ఇంకా ఎంతో మంచి చేసే అవకాశం రావాలని మనసారా కోరుకుంటున్నట్టు కూడా పేర్కొన్నారు. ఆ లేఖ సారాంశం ఇలా ఉంది.

ప్రియమైన అవ్వాతాతలకు..

మీకు, మీ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

ఈ రోజు 2024 జనవరి 1 నుంచి.. ఇచ్చిన మాట ప్రకారం.. ఇక మీ చేతికి అందే పెన్షన్ రూ.3000 అవుతుంది. నా సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్రలో నోరు తెరిచి అడగలేని ఎంతో మంది అవ్వాతాతలను, దురదృష్టవశాత్తు భర్తను కోల్పోయి జీవితాన్ని భారంగా నెట్టుకొస్తున్న వితంతువులను.. కష్టాలు, కన్నీరు తుడిచే వారు లేక దుఃఖంలో ఉన్న దివ్యాంగుల కన్నీటి వ్యథలను నేను స్వయంగా చూశాను. మీ మనవడిగా, మీ బిడ్డగా, మీ సోదరుడిగా ఆ మాటకు కట్టుబడి.. మేనిఫెస్టోలో చెప్పింది చెప్పినట్టు తు.చ. తప్పక పెన్షన్‌లను పెంచుకుంటూ మీ అందరి ఆశీర్వాదంతో, దేవుడి దయతో అందిస్తున్నందుకు సంతోషిస్తున్నాను. ఈ పెన్షన్ పెంపుతో మేనిఫెస్టోలో ఇచ్చిన నూరు శాతం హామీలు అమలు చేశామని చెప్పడానికి గర్వపడుతున్నాను.

చంద్రబాబు ప్రభుత్వంలో ఎన్నికలకు ముందు వరకు పింఛన్ కేవలం రూ.1,000 ఉండేది. ఆ ఐదేళ్లలో ఒక్కో అవ్వాతాతల కుటుంబానికి ఇచ్చిన పెన్షన్ రూ.58 వేలు. అదే మీ జగన్ తన నాలుగున్నర ఏళ్ల పాలనలో ఇచ్చిన పెన్షన్ ఏకంగా రూ.1.47 లక్షలు. దివ్యాంగులకు ఇచ్చిన పెన్షన్ ఏకంగా రూ.1.67 లక్షలు. రాష్ట్రంలో మనందరి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు అర్హులైన మరో 28.35 లక్షల మందికి.. కొత్తగా పెన్షన్‌లు మంజూరు చేశాం. ప్రతి నెలా పెన్షన్లు అందుకుంటున్న వారి సంఖ్య దాదాపు 66 లక్షలని చెప్పడానికీ సంతోషిస్తున్నాను.

గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నప్పటికీ, పెన్షన్ మంజూరు కావాలంటే నరకమే. పెన్షన్ మంజూరు కోసం జన్మభూమి కమిటీలకు లంచాలు, పెన్షన్ తీసుకోవడానికీ లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితులు. కానీ, ఇప్పుడు ప్రతినెలా ఒకటో తేదీన.. అది ఆదివారమైనా, మరే ఇతర సెలవు రోజైనా సరే సూర్యోదయంతోనే మీ ఇంటి తలుపు తట్టి గుడ్ మార్నింగ్ చెపుతూ మన వలంటీర్లు మీకు పెన్షన్ అందిస్తున్నారు. పెన్షన్ కోసం పడిగాపులు పడి, ఎక్కడో ఉన్న కార్యాలయం చుట్టూ తిరిగిన గత ప్రభుత్వ విధానాలకు.. మనందరి ప్రభుత్వానికి మధ్య ఉన్న ప్రధానమైన తేడా.. మనది మనసున్న ప్రభుత్వం. మనది పేదలు, మహిళలు, రైతుల పక్షపాత ప్రభుత్వం.

దేశంలోనే రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏదైనా ఉందంటే అది మన రాష్ట్రమని, ప్రజలందరి మన ప్రభుత్వమే ఇది చేయగలుగుతోందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. దేశంలో ఎక్కువ మందికి పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వం కూడా మన ప్రభుత్వమే. మీ ఆశీస్సులతోనే ఇదంతా చేయగలిగాను.

మీ ఆశీస్సులు, మీ మద్దతే నా బలం. ఆ బలం వల్లే కొత్త సంవత్సరంలో అడుగు పెడుతున్న ఈ సందర్భంలో ఇలాంటి మంచి ప్రయత్నాలను కొనసాగించగలిగాను. మీకు, మీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు మంచి జరగాలని.. ఆ దేవుడి దయ ఉండాలని కోరుకుంటున్నాను. దేవుడి దయతో, మీ అందరికి ఇంకా ఎంతో మంచి చేసే అవకాశం రావాలని మనసారా కోరుకుంటూ.. మరోసారి మీకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ప్రేమతో మీ..
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

'సామాజిక' జైత్రయాత్ర

నంద్యాల, గుంటూరు జిల్లా తాడికొండ, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఉత్సాహంగా సాగిన సామాజిక సాధికార యాత్రలు

సభలకు పోటెత్తిన బడుగు, బలహీనవర్గాలు

జై జగన్.. జైజై జగన్ నినాదాలతో దద్దరిల్లిన సభా ప్రాంగణాలు

సీఎం జగన్‌తోనే సామాజిక సాధికారత సాధ్యమైందన్న నేతలు

పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే ఎన్నికల్లో పేదల పక్షపాతి అయిన సీఎం జగన్ వెంట నిలవాలని పిలుపు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీ

- నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీపీఎస్సీ

సాక్షి, అమరావతి: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే గ్రూప్–2, గ్రూప్–1, పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు భర్తీకి చర్యలు తీసుకున్న ఏపీపీఎస్సీ.. తాజాగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీకి శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 11 సబ్జెక్టుల్లో 240 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ప్రకటించింది. పోస్టులు, విద్యార్హతలు, వేతనం, తదితర వివరాలతో కూడిన పూర్తి సమాచారాన్ని సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో జనవరి 24 నుంచి అందుబాటులో ఉంటుందని పేర్కొంది. పోస్టులకు సంబంధించి అభ్యర్థులు ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లు పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇందులో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (పేపర్–1) 150 మార్కు లకు డిగ్రీ స్థాయిలో ఉంటుంది. పేపర్–2 సంబంధిత సబ్జెక్టు పీజీ స్థాయిలో 150 ప్రశ్నలు 300 మార్కులకు ఉంటుంది. తప్పు సమాధా నానికి మైనస్ మార్కులు ఉంటాయని కమిషన్ పేర్కొంది. అభ్య ర్థులు జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. పరీక్షల సబ్జెక్టు సిలబస్ https://psc. ap.gov.inలో చూడవచ్చు.

ఏ సబ్జెక్టులో ఎన్ని పోస్టులు

సబ్జెక్టు	పోస్టులు
బోటనీ	19
కెమిస్ట్రీ	26
కామర్స్	35
కంప్యూటర్ అప్లికేషన్స్	26
కంప్యూటర్ సైన్స్	31
ఎకనామిక్స్	16
హిస్టరీ	19
మ్యాథమెటిక్స్	17
ఫిజిక్స్	11
పొలిటికల్ సైన్స్	21
జువాలజీ	19
మొత్తం	240



శనివారం తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ దర్శించుకున్నారు. తిరుమలలో శుక్రవారం అర్ధరాత్రి వరకు వైకుంఠ ద్వారం ద్వారా శ్రీవారిని 56,200 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీలో కానుకలుగా రూ.3.89 కోట్లు సమర్పించారు.

జిల్లా వార్తలు

'ఐలు' జాతీయ ఉపాధ్యక్షుడిగా కొల్లి సత్యనారాయణ



శ్రీనివాసరావు, సత్యనారాయణ

ఖమ్మం లీగల్ : ఇండియన్ లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ మహాసభలు ఈ నెల 28 నుంచి 30 వరకు పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని హౌరా నగరంలో నిర్వహించగా జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది కొల్లి సత్యనారాయణ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఏడునూతల శ్రీనివాసరావు, జలసూత్రం శివరాం ప్రసాద్‌లకు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు 25రాష్ట్రాల నుంచి 600మందికి పైగా, తెలంగాణ నుంచి 36మంది ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు.

ఉపాధ్యాయుడికి గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందుకుంటున్న సతీష్

కొత్తగూడెంఅర్బన్: దమ్మపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కత్తుల సతీష్ ఎమ్మెస్సీ జువాలజీలో గోల్డ్ మెడల్‌తో పాటు మెరిటి సర్టిఫికెట్ అందుకున్నారు. 2020 – 2022 విద్యా సంవత్సరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో ఎమ్మెస్సీ జువాలజీ పూర్తి చేసిన సతీష్ యూనివర్శిటీ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీలో శనివారం జరిగిన కార్యక్రమంలో గోల్డ్ మెడల్ అందుకున్నారు.

విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి

రఘునాథపాలెం: కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలని ఖమ్మం జిల్లా వైద్య శాఖ ప్రోగ్రామ్ అధికారి దుగ్గిరాల ప్రమీల సూచించారు. శనివారం ఆమె వీవీపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాస్కులు ధరించాలని, చేతులు శుభ్రం చేసుకోవాలని, గొంతునొప్పి, జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, ఏఎన్ఎం మేడా పుష్పావతి, ఆశ కార్యకర్త సుశీల తదితరులు పాల్గొన్నారు.

జీవితం ముందుకు పోలేక..

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వీఆర్ఏలు
- ఐదు నెలల కిందట వివిధ శాఖలకు సర్దుబాటు
- రెవెన్యూ తదితర విభాగాల్లో అర్హత ఆధారంగా పోస్టింగ్
- అయినా ఇప్పటివరకు అందని జీతాలు
- ఉద్యోగ ఐడీ కేటాయించక పోవడంతోనే సమస్య
- పలువురిని ఇతర జిల్లాలకు పంపించడంతో మరింత అవస్థ



నేలకొండపల్లి లో మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు (ఫైల్)

ఖమ్మంసహకారనగర్ / నేలకొండపల్లి: క్షేత్రస్థాయిలో ఒకప్పుడు కీలకంగా ఉన్న వీఆర్ఏలు ప్రస్తుతం వేతనాల్లేక అల్లాడుతున్నారు. గత ప్రభుత్వం వీఆర్ఏ (గ్రామ రెవెన్యూ అసిస్టెంట్) వ్యవస్థను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వారిని ఇతర ప్రభుత్వశాఖల్లో సర్దుబాటు చేశారు. విద్యార్హతల ఆధారంగా పోస్టింగ్‌లు నిర్ణయించి ఈ ఏడాది ఆగస్టు 9వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వారందరూ కొత్త స్థానాల్లో అదే నెల 10వ తేదీన విధుల్లో చేరారు.

నెలలుగా ఎదురుచూపులే...

రాష్ట్ర విభజన తర్వాత వీఆర్ఏలు రూ.6 వేల వేతనం అందుకున్నారు. ఆ తర్వాత వేతనాలు పెంచాలని పోరాడడంతో తెలంగాణ ప్రభుత్వం రూ.10,500కు పెంచింది. అయితే, ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన రెవెన్యూ చట్టంతో పదోన్నతుల అవకాశాన్ని కోల్పోయారు. ఈమేరకు దాదాపు 84 రోజుల పాటు సమ్మె చేయగా, సమ్మె విరమించి చర్చలకు వస్తేనే వీఆర్ఏల సమస్యలపై ఆలోచిస్తామని గత ప్రభుత్వం చెప్పడంతో అంగీకరించారు. ఈ క్రమాన వీఆర్ఏల ప్రతినిధులతో చర్చలు జరిపిన ప్రభుత్వం పురపాలక, ఇరిగేషన్, మిషన్ భగీరథ, ప్రభుత్వ పాఠశాలలు, రెవెన్యూ తదితర శాఖల్లో నియమించింది. ఇలా వీఆర్ఏలను ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేయగా.. ఐదు నెలలు గడుస్తున్నా నెల వేతనం కూడా అందలేదు. శాఖల సర్దుబాటు సమయాన తమ వేతనం చూసి ఆనందపడినా ఇప్పుడు చేతికి అందక ఏం చేయాలో పాలుపోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.

ర్యాండమైజేషన్‌తో సమస్య

ర్యాండమైజేషన్ ద్వారా వీఆర్ఏలకు పోస్టింగ్ ఇవ్వటంతో జిల్లాలోని వీఆర్ఏలు ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాకు వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమాన వారు కుటుంబాలకు దూరంగా ఉంటూ అక్కడకు వెళ్లిరావాల్సి ఉండడం సమస్యగా మారింది. వీఆర్ఏలు కొందరు సుదూరప్రాంతాల్లో విధులు నిర్వహించాల్సి రావటంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతుండగా, వేతనాలు రాకపోవడంతో మరింత ఇక్కట్లకు గురవుతున్నారు.

ఉద్యోగ ఐడీ ఏది?

వీఆర్ఏలుగా ఉన్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినప్పుడు సంతోషించారు. కానీ ఐదు నెలలు గడుస్తున్నా వీరికి ప్రభుత్వ ఉద్యోగులుగా ఐడీ నంబర్ (గుర్తింపు కార్డు) కేటాయించలేదు. దీంతో వారి వేతన బిల్లులు చేసేందుకు కుదరడం లేదని అధికారుల ద్వారా తెలుస్తోంది. కాగా, వీఆర్ఏల నుంచి ఆఫీస్ సబార్డినేట్‌గా పోస్టింగ్ పొందిన వారికి నెల వేతనంగా రూ.19 వేలు, రికార్డు అసిస్టెంట్ తత్సమాన హోదా పోస్టింగ్‌కు రూ.22,240, జూనియర్ అసిస్టెంట్ ఆ స్థాయి హోదా ఉద్యోగులకు రూ. 24,280గా వేతనం నిర్ణయించారు.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

ఇటీవల రాష్ట్రంలో కొత్తప్రభుత్వం కొలువుదీరింది. ఈ ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు వేడుకుంటున్నారు. ఐదు నెలల వేతనాలు రాక ఆర్థికంగా చితికిపోయామని చెబుతున్నారు. అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్న తమకు, ముమ్ముందు అప్పులు కూడా లభించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఇదే విషయమై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నాయకులు కలిసి విన్నవించారు.

జిల్లాల వారీగా వీఆర్ఏల వివరాలు

- **ఖమ్మం జిల్లాలో** గతంలో 672 మంది వీఆర్ఏలు ఉండగా.. ఇందులో 496 మందికి పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు 244 మందికి జూనియర్ అసిస్టెంట్/తత్సమాన, రికార్డు అసిస్టెంట్/తత్సమాన హోదాతో పోస్టింగ్ ఇవ్వగా, 252 మంది లస్కర్లు, ఆఫీస్ సబార్డినేట్లు కొనసాగుతున్నారు. ఇక 176 మంది వీఆర్ఏల వయస్సు 61 ఏళ్లు దాటడంతో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది.
- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో** మొత్తం 205 వీఆర్ఏలు ఉన్నారు. వీరిలో 45 మంది జూనియర్ అసిస్టెంట్లుగా, 38 మందికి రికార్డు అసిస్టెంట్లుగా వివిధ శాఖల్లో పోస్టింగ్ ఇచ్చారు. అలాగే, ఆఫీస్ సబార్డినేట్/లష్కర్/హెల్పర్లుగా 122 మందికి పోస్టింగ్ కేటాయించారు.
- **మహబూబాబాద్ జిల్లాలో** మొత్తం 387 మంది వీఆర్ఏలు ఉన్నారు. ఇందులో 66 మందికి రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా 32 మందికి మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లుగా, 61 మందికి రికార్డు అసిస్టెంట్లుగా రెవెన్యూలో, 19 మందికి ఆఫీస్ సబార్డినేట్లుగా రెవెన్యూలో, 101 మందికి లష్కర్లుగా ఇరిగేషన్ / క్యాడ్‌లో, 108 మందికి హెల్పర్లుగా మిషన్ భగీరథ పథకంలో పోస్టింగ్ ఇచ్చారు.

అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలి



ర్యాండమైజేషన్ ద్వారా వీఆర్ఏలను వివిధ శాఖలకు కేటాయించడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. అయితే, అనుభవం ఉన్న వారిని తిరిగి రెవెన్యూలోకి తీసుకుంటే బాగుంటుంది. అలాగే, వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి. వేతన బకాయిలు కూడా చెల్లించాలి.
– చల్లా లింగరాజు, వీఆర్ఏల సంఘం మాజీ అధ్యక్షుడు

మా ఇక్కట్లు పట్టించుకోండి..



గత ప్రభుత్వం వీఆర్ఏలను ఇతర శాఖలకు కేటాయించినా ఇంతవరకు జీతం చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుత ప్రభుత్వమైనా మా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం. ఈ విషయంలో కొత్త ప్రభుత్వం మా ఇక్కట్లను పరిగణనలోకి తీసుకోవాలి.
–ఉప్పు రమాదేవి, జూనియర్ అసిస్టెంట్

తక్షణమే వేతనాలు చెల్లించాలి



వీఆర్ఏలుగా విధులు నిర్వర్తించిన మాలో కొందరిని వివిధ శాఖలకు సర్దుబాటు చేశారు. ఇది జరిగి ఐదు నెలలు కావొస్తున్నా నేటి వరకు వేతనాలు ఇవ్వలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వేతనాలివ్వాలని కోరుతున్నాం.
–అమరం రాము, రెవెన్యూ శాఖ

ర్యాండమైజేషన్‌తో జిల్లా మారా..



నేను పదేళ్లు ఖమ్మం జిల్లాలో విధులు నిర్వర్తించగా.. సర్దుబాటులో భద్రాద్రి జిల్లా ఇల్లెందు మున్సిపాలిటీకి కేటాయించారు. దీంతో జిల్లా మారాల్సి వచ్చింది. ప్రయాణ ఖర్చులు పెరగడమే కాక ఐదు నెలలుగా వేతనాలు రాకపోవటటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.
–వడ్డెబోయిన ఉపేందర్, ఇల్లెందు మున్సిపాలిటీ

సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు దోహదం

- డీఈఓ సోమశేఖరశర్మ
- 'శ్రీ చైతన్య' రీజియన్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న డీఈఓ శర్మ, పక్కన శ్రీచైతన్య చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మంస్పోర్ట్స్: విద్యార్థుల్లో సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం శ్రీచైతన్య విద్యాసంస్థల రీజియన్ స్థాయి వార్షిక క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీఈఓ ప్రారంభించి మాట్లాడారు.. నేటి యాంత్రిక జీవనంలో చదువుకే పరిమితమవుతున్న విద్యార్థులకు ఇలాంటి క్రీడాపోటీలు అవసరమన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని, తమ పాఠశాలలో ఆ దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధి, ఐక్యతకు క్రీడలు ఉపయోగపడతాయని చెప్పారు. కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, త్రోబాల్, క్యారమ్స్, చెస్, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తుండగా రీజియన్‌లోని 14 పాఠశాలలకు చెందిన 1,591 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏజీఎం చేతన్ మాధుర్, జయప్రకాష్, ప్రిన్సిపాళ్లు టీఎల్ఎస్ శర్మ, రాజ్‌కుమార్ జోషి, ఏడుకొండలు, శ్రీదేవి, నీరజ, మురళీమోహన్, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

కోలాహలంగా గిరిజన గురుకులాల క్రీడలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారిణులు



లాంగ్ జంప్ క్రీడలో చిన్నారి

- ఉత్సాహంగా పోటీపడిన చిన్నారులు
- పోటీలను పర్యవేక్షించిన ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు
- నేటితో ముగియనున్న పోటీలు

ఇల్లెందురూరల్: తమ జట్టును విజయతీరాలకు చేర్చేందుకు విద్యార్థులు ప్రదర్శించిన నైపుణ్యం, తెగువ గిరిజన సంక్షేమ అధికారులను ఆకట్టుకుంది. ఒకరికంటే మరొకరు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి వారిని కట్టిపడేశారు. మొత్తంగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు వేదికైన సుభాష్‌నగర్ గిరిజన గురుకుల కళాశాల కేరింతలతో హోరెత్తుతోంది. మూడో రోజైన శనివారం నిర్వహించిన క్రీడా పోటీలను గిరిజన గురుకులాల ఖమ్మం ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు పర్యవేక్షించారు. పలు క్రీడాంశాలను పరిశీలించి ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. రెండో రోజు అథ్లెటిక్స్‌తోపాటు పలు క్రీడాంశాలలో విజేతలను నిర్వాహకులు ప్రకటించారు. అండర్–19 హ్యాండ్ బాల్ విభాగంలో జోన్–4 (మహబూబ్‌నగర్) విజేతగా నిలిచింది. అండర్–17 ఖో–ఖో ఈవెంట్‌లో జోన్–3 (ఖమ్మం) ప్రథమ స్థానంలో నిలువగా జోన్–4 (మహబూబ్‌నగర్) ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్–14 వాలీబాల్ ఈవెంట్‌లో జోన్–3 (ఖమ్మం) విజేతగా నిలవగా జోన్–1 (ఆదిలాబాద్) ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. అథ్లెటిక్స్‌లో అండర్–19 విభాగంలో జోన్–3 (ఖమ్మం)కు చెందిన శ్రీతేజ హైజంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. అండర్–17 విభాగం హైజంప్‌లో జోన్–1 (ఆదిలాబాద్)కు చెందిన వైష్ణవి ప్రథమ స్థానం దక్కించుకుంది. అండర్–14 విభాగం పరుగుపందెంలో జోన్–3 (ఖమ్మం)కు చెందిన సాత్విక ప్రథమ స్థానంలో నిలిచింది. పోటీలను గిరిజన గురుకులాల స్పోర్ట్స్ ఆఫీసర్ రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, వైస్ ప్రిన్సిపాల్ కవిత, పీఈటీలు, పీడీలు పర్యవేక్షించారు. కాగా, ఆదివారం పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



బాక్సింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు